క్లుప్తంగా

ఎంపీడీవోలతో మంత్రి సెల్ కాన్ఫరెన్స్



వేల్పూర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న నిర్వహించే సంక్షేమ సంబురాలు, లబ్ధిదారులతో జరిగే సభ ఏర్పాట్లపై బాల్కొండ నియోజకవర్గ ఎంపీడీవోలతో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సభ ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు. బాల్కొండలో జరగబోయే సభకు సంక్షేమ పథకాల లబ్ధిదారులంతా వచ్చేలా చూడాలని, క్షేత్రస్థాయిలో మానిటరింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. సెల్ కాన్ఫరెన్స్‌లో డీసీవో సింహాచలం పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: దళితులు, రాజ్యాంగ నిర్మాణ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన వ్యక్తిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని దళిత ఐక్య సంఘటన జిల్లా కన్వీనర్ జంగం అశోక్, కోటేశ్వర్‌లు, చంద్రయ్యలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలన్నారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం



నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమ ప్రాంగణంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి మండలంలోని ఐలాపూర్ సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్ రూ. 51 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మీసాల సుదర్శన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులు మూడ మల్లేశ్, బబ్లు దేవిదాస్, శంకరయ్య, ప్రభాకర్ తదితరులున్నారు

నాళేశ్వర్ పాఠశాలకు రూ.15 వేలు..

నవీపేట: నాళేశ్వర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావ్ బుధవారం రూ.15 వేల విరాళాన్ని అందజేశారు. గ్రామంలో ఇర్వహించిన బడిబాట కార్యక్రమంలో సర్పంచ్ ద్యాగసరిన్‌కు ఈ విరాళాన్ని అందజేశారు. డిటిటల్ విద్య అభివృద్ధికి, పాఠశాల గదుల తలుపులు, కిటికీల మరమ్మతులకు ఈ నిధులను వెచ్చిస్తామని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. సర్పంచ్ ద్యాగసరిన్, ఉప సర్పంచ్ లక్ష్మణ్, పీఆర్‌టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులు రచ్చమురళి, తదితరులున్నారు.

దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలి

సుభాష్‌నగర్: నిజామాబాద్ కలెక్టరేట్ ముందు వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రూ.6 వేలకు పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్నాలో ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ఈ సమాజంలో దివ్యాంగులు ప్రతి నిత్యం వివక్షకు గురవుతున్నారని, కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చిందని, కానీ మర్చిపోయిందన్నారు. రానున్న ఎన్నికలలో అన్ని పార్టీలు వారి మేనిఫెస్టోలో రూ.6 వేల పెన్షన్ ఇస్తామని పెట్టాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీఎస్ జాతీయ మహిళా అధ్యక్షురాలు సుజాత సూర్య వంశీ, నాయకులు ప్రమోద్ మాదిగ, సురేష్ మాదిగ పాల్గొన్నారు.

సంస్కృతిని నేర్పకపోతే సంస్కార హీనులవుతారు



నిజామాబాద్ సిటీ: పిల్లలకు చిన్నతనం నుంచి మన సంస్కృతి నేర్పకపోతే సంస్కార హీనులవుతారని, నేర్పితే పురుషోత్తములవుతారని హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామీజి అన్నారు. బుధవారం నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ బాలయోగి కృష్ణ మహరాజ్ ఆధ్వర్యంలో 3 రోజులుగా జరుగుతున్న సంస్కృతి బోధన శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఆశీస్సులు అందించి ప్రసంగించారు. విద్యార్థులకు ఉచితంగా సంస్కారాలను బోధించేందుకు ఈ సంస్కృతి బోధన శిబిరాన్ని నిర్వహిస్తున్న బాలయోగి కృష్ణ మహరాజ్ కృషి అభినందనీయమన్నారు.

సాగునీటి కల్పనలో దేశానికే ఆదర్శం

- కాళేశ్వరం, మిషన్ కాకతీయతో సాగునీటి కష్టాలు దూరం
- రూ.వేల కోట్లతో బోధన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాం
- బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్



నీటి పారుదల శాఖ పురోగతిపై పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

బోధన్‌రూరల్(బోధన్): వ్యసాయానికి కీలకమైన సాగునీటి కల్పనలో తెలంగాణ రాష్ట్రం భారతదేశానికే ఆదర్శంగా నిలిచిందని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సాగునీటి దినోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసగించారు. రూ.వేల కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించడం, చెరువులను పునరుద్ధరించడం, చెక్ డ్యాముల నిర్మాణాలతో రైతులు సాగు నీటి కష్టాలు లేకుండా పంటలను పండిస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతిపెద్ద ఇరిగేషన్ ప్రాజెక్టుగా పేరు పొంది దేశానికే గర్వకారణంగా నిలిచిందన్నారు. సాగునీరు, 24 గంటల ఉచిత కరెంట్, రైతు బంధు, రైతు బీమా, పండించిన పంటలకు లాభసాటి మద్దతు ధరతో తెలంగాణ రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు. జీడీపీ పెరుగుదలలో సైతం తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు.

బోధన్ నియోజకవర్గ ప్రజలకు రూ.2 వేల కోట్లు ఖర్చు చేశాం

నియోజకవర్గ ప్రజలకు వివిధ పథకాల రూపంలో ప్రభుత్వం రూ.2 వేల కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. నియోజకవర్గంలో 54, 232 మంది రైతులకు రూ.468.65కోట్లు రైతు బంధు అందించామన్నారు. నిరంతరం శ్రమిస్తున్న సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని ఆయన కోరారు. ఇరిగేషన్ ఈఈ సయ్యద్ అహ్మద్ జాని, డీఈలు బలరాం, లోక్య, శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్, ఎంపీపీలు బుద్దె సావిత్రి, శ్రీనివాస్‌లు, జెడ్పీటీసీ లక్ష్మీ, డీసీసీబీ డైరెక్టర్లు గంగారెడ్డి, శరత్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయి, వైస్ చైర్మన్ ఎండీ షకీల్ పాల్గొన్నారు.

ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరికలు



దేవేందర్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ అర్వింద్

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అంకాపూర్ దేవేందర్ రెడ్డి బుధవారం ఉదయం బీజేపీలో చేరారు. అంకాపూర్‌లో దేవేందర్‌రెడ్డికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆహ్వానించారు. రాష్ట్ర నాయకులు పల్లె గంగా రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, జీవీ నర్సింహా రెడ్డి, జెస్సు అనిల్, ద్యాగ ఉదయ్, అమ్దాపూర్ రాజేశ్ పాల్గొన్నారు.

ఉత్సవాలు నిర్వహించే అర్హత ప్రభుత్వానికి లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కొల వెంకటేశ్

ఆర్మూర్‌టౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాగునీటి ఉత్సవాలు నిర్వహించే అర్హత బీఆర్ఎస్ ప్రభుత్వానికి లేదని కాంగ్రెస్ నాయకులు కొల వెంకటేశ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు నీరు ఇస్తామని హామిఇచ్చి ఇప్పటి వరకు ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదన్నారు. ఆర్మూర్ నియోజకవర్గం అంతా పచ్చని పంటలతో సస్యశ్యామలంగా ఉండటానికి కాంగ్రెస్ పార్టీ నిర్మించిన ఎత్తిపోతల పథకాలే కారణమన్నారు. రైతులు సంతోషంగా లేనప్పుడు సాగు నీటి ఉత్సవాలు ఎందుకు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. మీసాల రవి, బాల కిషన్ పాల్గొన్నారు.

డొంకేశ్వర్‌లో బడిబాట



సర్వే చేపడుతున్న ఉపాధ్యాయులు

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా బుధవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించి పాఠశాలలో చేర్పించాలని కోరారు. నిష్ణాతులైన టీచర్లతో బోధన, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, స్కాలర్‌షిప్, డిజిటల్ తరగతులు, ఇతర వసతుల గురించి తెలియజేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్, టీచర్లు వెంకటరమణాచారి, శ్రీనివాస్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పండగను విజయవంతం చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో మనోహర్ రెడ్డి



బుస్సాపూర్‌లో కట్ట మైసమ్మ గుడి వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

రుద్రూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించనున్న ఊరూరా చెరువుల పండగను విజయవంతం చేయాలని ఎంపీపీ అక్కపల్లి సుజాత, జెడ్పీటీసీ నరోజి గంగారాం పిలుపునిచ్చారు. రుద్రూర్ మండలంలోని అక్బర్ నగర్, ఎర్రకుంట, అంబం(ఆర్) ఊర చెరువు, రుద్రూర్ తలాబ్ చెరువు, రాణంపల్లి కొత్త చెరువు, రాయకూర్ తొరతలాబ్, చిక్కడపల్లి ఊర చెరువు వద్ద ఉత్సవాలు జరుగుతాయని వివరించారు. గ్రామం నుంచి డప్పులు బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారులు వలలతో ర్యాలీగా తరలిరావాలని వారు కోరారు.

ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

కోటగిరి మండలంలో ఉత్సవాలు నిర్వహించే చెరువుల వద్ద ఏర్పాట్లను ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీవో మారుతి పరిశీలించారు. చెరువుల పండగ ఉత్సవాలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని జీపీ కార్యదర్శులను ఆదేశించారు.

బాల్కొండలో..


బాల్కొండ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చేపట్టే చెరువు కట్ట మైసమ్మ పండగను ఘనంగా నిర్వహించాలని మెండోరా ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం పలు గ్రామాల్లో చెరువు కట్ట మైసమ్మ స్థలాలను పరిశీలించారు. ఉదయం నుంచి బోనాలతో, వలగొడుగుతో ఊరేగింపు నిర్వహించాలన్నారు. అనంతరం కట్టపై హపంక్తి భోజనాలు చేపట్టాలన్నారు.

చెరువులు లేని గ్రామాలు..

మెండోరా మండలంలో పోచంపాడ్, నెహ్రూనగర్, నడిమి తండాలకు గ్రామ చెరువులు లేవు. దీంతో చెరుకు కట్ట మైసమ్మ పండగ ఆ గ్రామాల్లో లేనట్లే. ఆ గ్రామాల ప్రజలు పక్క గ్రామాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. పోచంపాడ్ వాళ్లు సోన్‌పేట్‌కు, నెహ్రూనగర్ వాసులు దూదిగాంక, నడిమితండావాసులు వెల్కటూర్‌కు వెళ్లాలని సూచించారు.

ఆధ్యాత్మికం..

హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ఆలయంలో యజ్ఞం చేస్తున్న భక్తులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీ హనుమాన్ ఆలయంలో బుధవారం భక్తి శ్రద్ధలతో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. పురోహితులు ఆంజనేయశర్మ, దినేష్ శర్మలు ఆలయ సంప్రోక్షణ, పాత ధ్వజ స్తంభ తొలగింపు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నలుగురు దంపతులతో యజ్ఞం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్, కాలనీ కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, రాజేందర్ గౌడ్, దుగ్యాల శ్రీనివాస్, లింబాద్రిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమి పూజ



వర్ని: మండలంలోని కోకల్ దాస్ తండాలో జనరల్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి బుధవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ చేశారు. రూ.40 లక్షలతో హాల్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు స్పీకర్ వెల్లడించారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు ఊరట కలిగించటానికి ప్రతి గ్రామంలో జనరల్ ఫంక్షన్ హాల్‌లా నిర్మాణం చేపడుతున్నట్లు స్పీకర్ వెల్లడించారు కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిదాసు, సర్పంచ్ భారత్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలపై అవగాహన కల్పించాలి

రుద్రూర్: గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య అన్నారు. కోటగిరి మండలం హంగర్గఫారంలో నిర్వహిస్తున్న శిబిరాన్ని బుధవారం సందర్శించారు. వైద్య సిబ్బంది చేస్తున్న కంటి పరీక్షలు పరిశీలించారు. అర్హులందరూ కంటి పరీక్షలు చేయించుకునేటట్టు ప్రచారం చేయాలని సూచించారు.

నియామకం

నిజామాబాద్‌నాగారం: జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మూడా రవి, జిల్లా కార్యవర్గ సభ్యులుగా బొడ్డు సత్యనారాయణలను నియమిస్తూ బుధవారం జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున్, ఉత్తర్వులు జారీ చేశారు. కార్మికుల సమస్యలను గుర్తించి, జాతీయ, రాష్ట్ర అధ్యక్షుల సమక్షంలో సమస్యలను పరిష్కరించి చేనేత సంఘం బలోపేతానికి కృషి చేస్తామని రవి అన్నారు.

సమాచారం..

కులవృత్తుల అభివృద్ధి కోసం బీసీలకు రూ.లక్ష రుణం

రుద్రూర్: కులవృత్తుల అభివృద్ధి కోసం బీసీలకు వంద శాతం సబ్సిడీపై రూ.లక్ష రుణం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కోటగిరి, రుద్రూర్ ఎంపీడీవోలు మనోహర్ రెడ్డి, బాల గంగాధర్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. దరఖాస్తుదారులు 18- 55 ఏళ్ల లోపు ఉండాలని, సంవత్సరాదాయం రూ.లక్షా 50 వేల లోపు ఉండాలని, దరఖాస్తు చేసే నాటికి గత ఐదేళ్లలో ఎలాంటి సంక్షేమ పథకాలతో రుణం తీసుకోని వారై ఉండాలని వివరించారు. అర్హులైన బీసీలు ఈ నెల 20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఎమ్మెల్సీ దంపతులు



నవీపేట: పోతగంల్‌లో జరుగుతున్న శివపంచాయతన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలలో ఎమ్మెల్సీ కవిత దంపతులు బుధవారం పాల్గొన్నారు. మంగళ హారతులతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి భక్తులకు ప్రవచనాలు చేశారు. గురువారం ఉత్సవాల ముగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సాగునీటి రంగంలో తెలంగాణది సరికొత్త చరిత్ర

- ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

ఆర్మూర్‌టౌన్: కోటి ఎకరాల పంటకు సాగునీరు, మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువు వద్ద బుధవారం జరిగిన సాగునీటి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ ట్యాగ్ లైనే 'నీళ్లు, నిధులు, నియామకాలు' అని గుర్తు చేశారు. సాగునీటి రంగంలో తెలంగాణది సరికొత్త చరిత్ర అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్టు ఇరిగేషన్ పథకమైన కాళేశ్వరం ప్రాజెక్టు మహాద్భుతమన్నారు. మిషన్ కాకతీయ ద్వారా ఆర్మూర్ నియోజకవర్గంలో 220 చెరువుల పునరుద్ధరణ జరిగిందన్నారు. కేసీఆర్ ప్రధాన మంత్రి కావాలన్నది దేశ ప్రజల మనోగతమని పేర్కొన్నారు.జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, మున్సిపల్ చైర్మన్ పండిత్ వినీత, వైస్ చైర్మన్ షేక్‌మున్ను, ఎంపీపీలు నర్సయ్య, సంతోష్, ప్రభాకర్, జిల్లా పరిషత్ సీఈవో గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు

సాక్షి ఎఫెక్ట్..

బాల్కొండ: మెండోరా మండలం వెల్కటూర్ శివారులో వ్యవసాయ క్షేత్రాల నుంచి రెండు నెలల క్రితం గుర్తు తెలియని దుండగులు ఏడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్లారు. వాటి స్థానంలో ట్రాన్స్‌కో అధికారులు వేరే ట్రాన్స్‌ఫార్మర్లను వారం రోజుల క్రితం అమర్చారు. కానీ కనెక్షన్ ఇవ్వాలంటే ట్రాన్స్‌ఫార్మర్లకు వెల్డింగ్ చేపట్టాలని మెలిక పెట్టారు. దీంతో కనెక్షన్ ఇవ్వడంలో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం వహించడంపై బుధవారం సాక్షి దిన పత్రికలో 'ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపం 'అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు బుధవారం ఏడు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు. కనెక్షన్‌లు ఇవ్వడంపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



కనెక్షన్‌ను పరిశీలిస్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్

సామూహిక అన్న ప్రాశన



కోనాసముందర్‌లో అన్నప్రాశన కార్యక్రమం నిర్వహిస్తున్న సర్పంచ్ రూప



నాగాపూర్‌లో.. సూపర్ వైజర్ శ్రీదేవి

కమ్మర్‌పల్లి: కోనసముందర్, ఉప్లూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం సామూహిక అన్న ప్రాశన కార్యక్రమం నిర్వహించారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్న ప్రాశన, విటమిన్-ఏ ద్రావణాన్ని అందించారు. చిన్నారులకు తల్లి ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ రూప పాల్గొన్నారు.

నాగాపూర్‌లో..

బాల్కొండ: నాగాపూర్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన, బాలామృతం అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ.. చిన్నారులకు పోషకాహారాన్ని అందించాలన్నారు. తల్లిపాలతో పాటు బాలామృతం అందించాలని సూచించారు.

అంతాపూర్‌లో గర్భిణులకు సీమంతం

వర్ని: అంతాపూర్ అంగన్వాడి సెంటర్లో గర్భిణులకు బుధవారం సర్పంచ్ పద్మ ఆధ్వర్యంలో సీమంతం నిర్వహించారు. పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, హెల్త్ బేబీ షో కార్యక్రమాలను నిర్వహించారు. ఉప సర్పంచ్ నెహ్రూ, పంచాయతీ కార్యదర్శి వినోద్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అంతాపూర్‌లో సీమంతం నిర్వహిస్తున్న సర్పంచ్

చెరువుల పండుగకు ఎమ్మెల్సీ కవిత రాక

ఎడపల్లి(బోధన్): దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో గురువారం(నేడు) ని ర్వహించే చెరువుల పండగ కార్యక్రమానికి ఎ మ్మెల్సీ కల్వకుంట్ల కవిత, స్థానిక ఎమ్మెల్యే మ హమ్మద్ షకీల్ హాజరవుతున్నట్లు స్థానిక ఎంపీ పీ శ్రీనివాస్ తెలిపారు. ఎడపల్లి చెరువు కట్టపై నిర్వహించే కార్యక్రమాలకు వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీసీ బంధు కింద రూ.10 లక్షలు అందించాలి



సుభాష్‌నగర్: బీసీలకు బీసీ బంధు పథకం కింద రూ.10 లక్షలు అందించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. యాదవ్ మాట్లాడుతూ.. 2014-15లో బీసీలకు సబ్సిడీ రుణాలని ఒక లక్షకు 80 శాతం, రూ.రెండు లక్షల నుంచి మూడు లక్షల వరకు 70 శాతం సబ్సిడీ ఇస్తామని ఇవ్వలేదని, 2018లోను ఓట్ల కోసం ఉత్తుత్తి హామీలు ఇచ్చి విస్మరించారని పేర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికల కోసం కులవృత్తుల వారికి రూ.లక్ష రుణం పేరిట సీఎం కేసీఆర్ మోసానికి తెరలేరన్నారు. బీసీలను అన్నిరంగాల్లో మోసం చేస్తున్న కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 -	ఫాస్ట్ ఎక్స్-3డీ (తెలుగు) 1.00 చక్రవ్యూహం - 4.00 అహింస - 6.30 బిచ్చగాడు (2) - 9.55
స్క్రీన్-2 -	బిచ్చగాడు(2) - 12.20 మేమ్‌ఫేమస్-3.35, పరేషాన్- 6.45 2018 - 9.40
స్క్రీన్-3 -	అహింస- 12.35 ; 2018 - 4.00 నేను స్టూడెంట్ సర్ - 7.10, 10.00
స్క్రీన్-4 -	మేమ్‌ఫేమస్ - 12.25 స్పైడర్‌మాన్ (తె) - 3.35, 9.45 ; (ఇంగ్లీష్) - 6.40